



# సనాతనిష్ఠ విభ్రమం

**శ్రీ కొడవటిగంటి కుటుంబరావు**

మాతాలూకా పల్లెటూళ్లలో గమనించదగిన విశేషం ఏమిటంటే—అరుగులు. వాటినిగురించి రాయాలంటే ఎంత అయినా ఉంది.

ఈ అరుగులు వీధివాకిలి కిరుపైపులా ఉంటూ నామమాత్రంగా ఇంటివారి హక్కు భుక్తములలో ఉన్నవయి, క్రియకు ఊరివారందరికీ ప్రైవేటు మీటింగులు చెయ్యటానికి ఉపయోగపడుతూ ఉంటవి. అది లచ్చయ్యగారి అరుగు కానివ్వండి, సనాతనిష్ఠ యాజులుగారి అరుగు కానివ్వండి, అడివి శంకరయ్య గారిది కానివ్వండి, మీరు ఆగ్రామస్థులు కినక అయినట్లయితే, ఆ అరుగు "విడిగా" ఉన్నప్పుడు మీరువెళ్లి, అప్పటికి అక్కడ హాజరులో ఉన్న నలుగు రయిదుగురితోనూ మీరు దానిమీద ఒక సభచేసి, మీ లాగా ఆసమయానికి ఆ ప్రదేశములో హాజరుగా ఉండనట్టి ఏ కొందరిని గురించిగాని దూషణ భూషణ తిరస్కారాదులు జరిపి, మీపని పూర్తి కాగానే పైబట్టలు దులిపి ఎవరిదారిన వారు చక్కాపోవచ్చును. ఇందు కెవరి అభ్యంతరమున్నూ ఉండబోదు.

ఇది బస్తీలలో వల్లపడదు. ఉత్త మునిసిపాలిటీల శకంలోనే పర్మిషనులనీ లైసెన్సులనీ పెట్టి వీధిమీదికి ఉండే అరుగుల అభివృద్ధికి చాలా అంతరాయాలు ఏర్పాటు చేశారను కుంటే, కమిషనర్లూ స్పెషల్ ఆఫీసర్లూ రావటంతో బస్తీలలో వాళ్లు బయటి అరుగులకు పూర్తిగా నీళ్లు విడిచిపెట్టవలసి వచ్చింది.

ఆన 19...సం॥ ది6 జూన్ తారీఖున్ను...గ్రామ కాపురస్థులు (1) కలవా గౌరీశ్వర సోమయాజులు (వరఫ్ సనాతనిష్ఠ యాజులు) (2) అడివి శంకరయ్య (లేక తిక్క శంకరయ్య) (3) అగస్త్యుల సీతాపతి శాస్త్రి, వీరుగాక నలుగురు బ్రహ్మచారులూ కలిసి గౌరీశ్వర సోమయాజులవారి వీధి అరుగులమీద సదరు యాజుల వారి ఆధిపత్యం కింద ఒక దిన్ను అట్లాగున్ ఎసెంబ్లీ అయినారు.

"చలమయ్య కొవకూతురు వచ్చిందే!" అన్నాడు శంకరం.

"అంత దూరాన చూసి ఎవరోకిరస్తానీ పంతులమ్మేమో అనుకున్నా. తీరాచూస్తే మన మిస్సమ్మే!" అంటూ సీతాపతి బ్రహ్మచార్లకేసి కన్నుమలిపాడు. బ్రహ్మచార్లు తలలు ఎరగవేసి నవ్వారు.

"అది ఆ ఇంగిలీషు చదువులో ఉంది. ఇంగిలీషు చదువు మనకందరికీ కిరస్తానీ కూడు కుడపటానికి కాదూ వచ్చింది?...ఏమిటో లచ్చయ్య అభిప్రాయం?"

"ఎప్పుడో చల్లగా పిల్లదానికి పెళ్లి చేస్తాడు. అంత కన్న అభిప్రాయం ఏముంటుంది? దాన్ని చదువూ, దాని వేషం, దానివాలకం—అంతా కళ్లఎదట కనపడుతూనే ఉందిగా!" అన్నాడు సీతాపతి.

"ఆహా! కనపడ్డేం? వాళ్లతాత దాని అవతారం చూస్తే ప్రాయోపవేశం చేసి ఉండేవాడు!... దీనికేదో చెయ్యాలి మనం. నేను లచ్చయ్యతో ఖచ్చితంగా ఒక సారి మాట్లాడాలను కుంటున్నా. ఏమంటావు, సీతాపతీ?"

"కానియ్యి మరి. శుభస్యశీఘ్రం. ఏదో విధంగా నలుగురి తలకాయలూ ఒకచోట చేర్చి ప్యాక్టీలు తీసేసు కున్నామా? మళ్లీ లచ్చయ్య కూతురి పెళ్లి చెయ్యటం, నేను చెయ్యలేదు అదే చేసుకుంది అనటం, కొందరు వెళ్ళ టం, కొందరు వాళ్లింటికి వెళ్లకపోవటం—కానీండి! అదేదో దబ్బున తేల్చుకుంటే మళ్లీ మనప్యాక్టీల గోలలో మునంపడదాం!" అన్నాడు సీతాపతి ఊరి పాలిటిక్సు గూడావస్తూ తన నెత్తిమీదిగానే వెళుతున్నట్టు.

"ఓ నువ్వురా, అడివీ?"

"మరేం లేదుగాని, బాబాయి! గ్రాంధ్మహాత్మ్ము లంటారు గదా—"

"ఓరి నీ గ్రాంధ్మహాత్మ్ములు గడ్డలుగానూ! మతాన్ని గంగలో కలపటానికి చూస్తున్న కోమటి ముండా కొడుకును పట్టాడు వదలడేమండీ ఈనా?" అన్నాడు యాజులు.

"మరేం లేదుగాని ఆయన వెధవల్ని పెళ్లాడమని ఉత్తరువు చేశారుకదా అని చెప్పబోయినాను!" అన్నాడు శంకరయ్య.

"వాడికేం? వాడు రేపు కులభ్రష్టత చెయ్యమంటే చేస్తావుట్రా?" అన్నాడు యాజులు కదులుతున్న పళ్లు బిగబట్టి.

"ఏం లాభమంటాను? జుట్టు దువ్వుకుంటుందీ, పూలు పెట్టుకుంటుందీ, చదువుకొంటుందీ! వైధవ్యం తప్పుతుందా? పోయిన పసుపూ కుంకం మళ్లీ వస్తయ్యా? రావూ! పెళ్లిచేసుకోటం కల్లోవార్తా! దానికి పెళ్లిచేసి లచ్చయ్య ఊళ్లో ఒక్కఘడియ ఉండగలడూ?" అని అడిగాడు యాజులు ధీమాగా.

"ఎట్లా ఉంటాడూ?" అని తిరిగి అడిగాడు సీతాపతి.

"ఎందుకుండడూ?" అన్నాడు శంకరయ్య చేనోన్ని గురించి ఆలోచిస్తూ, బ్రహ్మచార్లంతా నవ్వారు.

"ఎవరు వారు?" అన్నాడు యాజులు అనవసరంగా కళ్లమీదికి ఎండపడుతుందేమో నన్నట్టు చెయ్యి అడ్డంపెట్టి. అప్పుడే చీకటి పడబోతున్నది. దారివెంట నెత్తిన పెద్ద గడ్డిమోపుతో వెళుతున్న మనిషి ఆ ప్రశ్నవిని ఆగి "నేనే, మామా!" అన్నాడు.

"సుబ్బన్నా! నువ్వు కొట్టింకాన్నుంట్రా? మా వెధవ—"

"అయితే, మామా! మన లచ్చయ్యగారింటికి కెవరో వస్తున్నారే! పాతికేళ్లవాడు. సాయిబుల్లే ఉన్నాడు. ఏవూరంటిని; చెప్పలా! లచ్చయ్యగారి యింటికని మటుకు అన్నాడు."

"ఎందాకా వచ్చాడేం?"

"సూరయ్యగారి చామిదాకా వచ్చి ఉంటాడు!" అంటూ సుబ్బన్న సాగాడు.

ఎల్లెంట్లీ మెంబర్లు మొహామొహాలు చూసుకున్నారు. లచ్చయ్యగారింటికి సాయిబులు కూడా రావటందాకా వస్తే ఇక ఎవరివల్లా అయేదేమీలేదు. "ప్యాక్టీలు" తప్పవనేమో సీతాపతి నిట్టూర్పు విడిచాడు. ఆలోచన అభినయించుతూ బ్రహ్మచార్లు మెదలు గోక్కోటం మొదలుపెట్టారు. ఇంతలో వీధి చివర ఆగంతకుడి ఆకారం కనిపించింది. కొందరిగానూ సాయిబుల పోషను అయితే చెప్పలేం కాని వచ్చే కుర్రవాడిలో సాయిబు లక్షణాలేమీ లేవు. అతనికి పాతికేళ్లూ లేవు, ఇరవై రెండు కన్న ఎక్కువ ఉండవు.

"ఎవరు వారు?" అన్నాడు యాజులు గంభీరంగా.

"తమరెవరు?" అన్నాడా గంతకుడు సవినయంగా.

"ఏవూరు?" అన్నాడు సీతాపతి.

"ఏమది?" అని తిరుగు ప్రశ్న వచ్చింది.

"ఓయ్!" అన్నాడు యాజులు.

"చిత్రం! సరిగ్గా ఆమాటే నేనూ అందామనుకుంటు న్నాను. ప్రశ్నలకు సమాధానం చెప్పటం ఇష్టంలేనివాళ్లు ఎన్నడూ ప్రశ్నలు వెయ్యకండి!" అంటూ ఆ గంతుకుడు లచ్చయ్యగారింటివేపు సాగిపోయినాడు.

౨

యాజులు పెద్ద సంకెగ్గావస్థలో పడ్డాడు. ప్రసాదరావు రాక ఆయన ప్లానులన్నిటినీ తారుమారు చేసింది. యాజులు, పాపం, మతాన్ని గురించీ, ధర్మాన్ని గురించీ లచ్చయ్యగారి ఎదట ఏకరు పెట్టడానికి చిన్న ఉపన్యాసం తయారుచేశాడు. ఏమిలాభం? అంతా బూడిదను బోసిన పన్నీరయింది. ఆ కుర్రవాడి ఎదట ఆ ఉపన్యాసం వెళ్లవలసిన తీరుగా వెళ్లదు. యాజులు ఉత్తమశ్రేణికి చెందిన సనాతనిష్టు కాడని కాదు, ఆకుర్రకుంకను చూస్తే ఆయనకు భయమనీ కాదు. అదొక మనోదౌర్బల్యం.

అందుకని యాజులు తన ప్రయత్నం నుంచి విరమించ వలిసినదేనా? ఒక్కనాటికి కాదు. అన్నిటికీ ఉన్నాడుగా పాపాల భైరవుడు, తిక్క శంకరయ్య!

యాజులుగారు అర్జెంటుగా రమ్మంటున్నారని ఒక బ్రహ్మచారి వచ్చి శంకరయ్యకు కబురు అందించి వెళ్లిపోయినాడు. అప్పుడే భోంచేసి భుక్తాయాసం తీరటానికి మంచం వేసుకుంటున్న శంకరయ్య మంచం అక్కడే వదిలిపెట్టి యాజులుగారింటికి ప్రయాణమైనాడు.

"ఒరే! శంకరం! ఈపని నీవల్లనే కావాలి."

"అదెంత భాగ్యం! ఏంచెయ్యమంటావు నన్ను?"

"ఒక్కసారి నువ్వు లచ్చయ్యగారింటికి పోయి రావాలి."

"ఇప్పుడు! నుంచున్నట్టుగా రానూ?" అంటూ శంకరయ్య బయలుదేరాడు.

"ఒరే! ఒరే! మాట! ఏమిటా పోవటం? పోయి ఏం చేస్తావు?"

"ఏం చెయ్యమన్నావో చెప్పమరి!"

"నిన్న లచ్చయ్యగారింటికి వచ్చిన కుర్రవాడెవరో, ఎందుకు వచ్చాడో, వాడూ సరోజినీ ఒకరితో ఒకరు లేచి పొయ్యేటట్టున్నారేమో—వెకవెకలూ పకపకలూ ఆడుతున్నారేమో—చూసిరావాలి. నేను పంపించానని చెప్పేవు సుమా! నువ్వు మరీ ఎద్దుమొద్దు స్వరూపానివి! ఆఁ? వెళ్లు! ఏమేం తెలుసుకోగలవో అవన్నీ తెలుసుకురా! తరవాత సంగతి ఆలోచిద్దాం!"

అడివి శంకరయ్య "లచ్చయ్యబాబూ!" అంటూ లోపలికి వచ్చేటప్పటికి నిన్న వచ్చిన కుర్రవాడు ఒక కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చూస్తున్నాడు, అతని వెనకగా కుర్చీమీద చేతులు పెట్టి సరోజిని ఆపుస్తకమే చూస్తున్నది. ఇద్దరూ చెప్పతరం కాకుండా విరగబడి నవ్వుతున్నారు. ఇంకేం ఒకపాయింటు తేలిపోయింది. ఈ యిద్దరూ లేచి పోవటం రూఢే! యాజులెంత దూరాలోచన కలవాడు!

"రండి తాతగారూ, కూర్చోండి!" అని ప్రసాదరావు శంకరయ్యను గౌరవం చేశాడు, తనే గృహాయజమానల్లే.

శంకరయ్య దూరంగా కూర్చున్నాడు. ఆయనకు చప్పు చప్పున వెయ్యవలసిన ప్రశ్నలన్నీ వేసేసి యాజులు ముందు ఎప్పుడు వాలుదామా అనిఉంది. కాని ఎట్లా ఉపక్రమించాలో తెలియలేదు చివరకు తెగింపుచేసి మీదేగ్రామం, నాయనా?" అన్నాడు శంకరయ్య.

"నేను ప్రస్తుతం పట్నంలో ఆనర్సు చదువుతున్నానండీ!" అన్నాడు ప్రసాదరావు.

"మా లచ్చయ్యబాబూ నీకేం కావాలి?"

"నాకేమీ అక్కర్లేదు!" అన్నాడు ప్రసాదరావు చాలా తాపీగా.

శంకరయ్య నిర్ఘాంత పోయినాడు. చదువుకున్నవాళ్లు మాట్లాడితే అర్థంచేసుకోవటం కష్టమని ఆయనకు తెలుసును. కాని ఇంత కష్టమని ఆయన ఎన్నడూ అనుకోలేదు. "ఏమిటది?" అని అడిగితే తన మర్యాదకు భంగం కలుగుతుందని దాన్ని అంతటితో పోనిచ్చాడు.

"అట్లాగా? అయితే నువ్వీ గ్రామం ఏంపని మీద వచ్చావు, బాబూ?"

"సరోజిన్ని చూసిపోదామనీ, మిమ్మందర్నీ కలుసుకుందామనీ!"

శంకరయ్య ఈ సమాధానానికి ఆశ్చర్య పోయినాడు. సామాన్యంగా ఇంగిలీషు చదువుకున్న వాళ్లకు ఇంతకలుపుగోలుతనం ఉండదు. శంకరయ్యకు మరికొంచెం సేపు కూర్చుని ఈ మంచి కుర్రవాడితో గాంధి మహాత్ములను గురించి మాట్లాడుదా మనిపించింది.

"ఏమండీ, తాతగారూ! మిమ్మల్ని యాజులుగారేనా పంపించింది?"

శంకరయ్య నిర్ఘాంత పోయినాడు. ఇది కేవలం గారడీగా ఉంది. ప్రసాదరావు ఆయన ముఖంగారు చూసి నవ్వుతూ, "నన్ను మీవూరివారు ఎరగరు గాని నేను అందర్నీ ఎరుగుదును," అన్నాడు.

"ఇదుగో చూడు, నాయనా! యాజులు నన్నిక్కడికి పంపించిన మాట ఎవరితోనూ చెప్పవద్దన్నాడు. నీకు తెలిస్తే తెలిసింది కాని ఇంకెవరికీ చెప్పకు. నువ్వొకుండా నే అన్నాను! ఆc!"

"అయితే, తాతగారూ! మీకు గాంధిమహాత్ముడంటే గురికదా? మీరు యాజులూ వాళ్లతో ఎందుకు కలుస్తారూ? ఇప్పుడు సరోజిని పెళ్లి చేసుకుంటానంటే యాజులు వద్దంటాడు! అదే గాంధి మహాత్ముడైతే తప్పకుండా చేసుకోమంటాడు! గాంధీమహాత్ముడెక్కువా? యాజులెక్కువా?

"చాలా ముఖ్యమయిన విషయం తీసుకొచ్చావు. చూడు, బాబూ! గాంధీ మహాత్ములకు హిందూధర్మమంటే ఇష్టమని చెబుతారే? వితవముండల పెళ్లిళ్లు చేసుకోమంటా డెందుకూ?"

"నేనొక్క రహస్యం చెబుతాను వింటారూ? వితవముండల పెళ్లిళ్లు ఎప్పుడూ తప్పే! విన్నారూ? గాంధి మహాత్ముడికి కూడా ఆమక్క తెలుసు!"

"ఆc! ఆc! అట్లాగా?" అంటూ చెవులురిక్కించి (?) వినటం మొదలు పెట్టాడు శంకరయ్య. ఇంత తెలివిగల కుర్రవాణ్ణి తను ఎన్నడూ చూసి ఎరగడు. "ఆc! ఆc!"

"అయితే ఇది ఏయుగం?"

"ఆc!"

"చెప్పండి! ఇది ఏయుగం?"

"కలియుగం కాదూ?"

"కాదూ మరి? కలియుగంలో ధర్మం ఒక్కపాదం మీదనే నడవాలి! యుగధర్మం పాటించాలి. వానాకాలంలో మామిడిపళ్లు రావడములేదా? మామిడిపళ్లు మంచివే కావటానికి! ఏమంటారు?"

"బాగుంది! బాగుంది! ఎట్లాగు?"

"గాంధీ మహాత్ముడు అవతారం కనక ఆయన యుగధర్మం అమలులో పెడతాడు గాని సనాతన ధర్మం లెక్కచెయ్యడు. రాముడేం చేశాడు? తన యుగధర్మం పాటించి రాక్షసులను సంహారించాడు. కృష్ణుడు ఏం చేశాడు? రాక్షసులను చేరదీశాడు. ధుర్యోధనుణ్ణి పాండవుల పక్షాన ఉంచాడు. ఏమేంటి విచిత్రం! అది యుగధర్మం! వితవముండలు పెళ్లి చేసుకు తీరాలి. అది యుగధర్మం. ఇంకో చిత్రం చూడండి. సనాతనులు కృత యుగధర్మం తెచ్చిపెట్టాలని చూస్తారు చూశారూ? వాళ్లంతా లోపల అమిత పాపాత్ములు. వాళ్లకెప్పుడూ ఇంకొళ్ల యేడ్పే! ఇప్పుడు మీవంటి పుణ్యాత్ములకు సరోజిని పెళ్లిచేసుకుంటే దగాదా? మీరూ సంతోషిస్తారు, ఒక బుద్ధిమంతుడూరాలు సుఖపడుతున్నది కదా అని, అవునంటారా? కాదంటారా?"

"అది సుఖపడితే నేను సంతోషించనా? నాకు కూతుళ్లు లేరూ! నాకు తురోకటీ అనుకటీనా నాకు?"

"యాజులు చూడండి మరి! ఎవరు ఏ పెళ్లి చేసుకున్నా తనధర్మం చెడదుకద. ఎవరన్నా సుఖపడుతుంటే ఆయనకు ఏడుపు! అనకూడదు కాని ఆయన సరోజిని వంక అదో రకంగా చూస్తాడుట, చూపులతో శరీరమంతా తడివి నట్టవుతుందిట, పాపం, సరోజినికి!"

శంకరయ్య మళ్లీ నిర్ఘాంత పోయినాడు—నమ్మలేక పోయినాడు. "యాజులే? కాకపోయినా అముండా

కొడుకు అందరివంకా అట్లాగే చూస్తాడు. ఏమో, ఎవరు చెప్పగలరు? బ్రహ్మలైనా పుట్టు రిమ్మ తెలుగు!"

"మీ కాశ్చర్యంగా ఉన్నట్టుంది. నేనింకా ఈ ఊళ్లో నాలుగు రోజులుంటాను. మీరు స్వయంగా చూసి స్తారు కాదూ ఆయన ప్రకృతి!" అన్నాడు ప్రసాదరావు.

## 3

సరోజినీ ప్రసాదరావూ ఎవరి ఆలోచనలో వారు ఉండి పోయినారు.

"నీ దుర్మార్గం కొంచెం దుస్సహంగా ఉందిరా, ప్రసాదరావూ" అంది సరోజిని.

"నీకు తెలేకపోతే నీవు ఊరుకోరాదుటే! ఆడదానివి నీకేం తెలుసు? రెండు ఆటబొమ్మలాడి ఒక కొంప నిలబెట్టుమన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీ పెళ్లి అయిన మరుక్షణం మీనాన్నను యాజులు వెలివేయించ గలడు. ఆగాడిద కోరలు తీసేసి కాని నేనిక్కడ్నించి కదలను. తెలిసిందా? నీకేం? నీవారికి నువ్వూ నీ మొగుడితో మిలుకుతూ చక్కా పోతావు. ఇక్కడ పెదనాన్న పాట్లు దిక్కులూ దిక్కులూ పడవు. యాజుల పాత మార్చుతాను."

"అదంతా బాగానే ఉంది. పోనీ, ఈపిచ్చివాణ్ణి నువ్వు గోలచేస్తుంటే నాకు కష్టంగా ఉంది."

"శంకరయ్యా?... మనచేతికి బ్రహ్మాండం దొరికింది. దాన్ని ఉపయోగించుకోకపోతే ఎట్లాగేం? నా అభిప్రాయం కొద్దీ ఈ ఆయుధాన్ని నేను పట్టుకోడానికి అనువయిన పిడి వేసుకుంటున్నాను. తప్పా?"

"ఏమో! పాటిమనిషిని గురించి చేతికర్రను గురించి మాట్లాడేటట్టు మాట్లాడితే తప్పో ఒప్పో నేనేం చెప్పను!"

"ఓహో! నీ సెంటిమెంట్సు ప్రస్తుతం కట్టిపెట్టు! నేను శంకరయ్యకేమీ అపకారం చెయ్యబోవటం లేదు."

## ౪

లచ్చయ్యగారి యిల్లు వదిలిపెట్టిన తరవాత శంకరయ్య పారవశ్యంలో తనకోసం అరుగుమీద కనిపెట్టుకుని ఉన్న యాజులుమాట మరిచిపోయి యింకాయింకీ కొంప చేరుకున్నాడు. అతగాడి ముఖారవిందం కోసం నిరీక్షించి నిరీక్షించి విసికి యాజులు తూర్పుపాలెం వెళ్లాడు.

మర్నాడు ఉదయం ఇద్దరు బ్రహ్మచార్లు శంకరయ్యను చెరొక చెయ్యీ పట్టుకుని యాజులుగారింటికి నడిపించుకుంటూ వచ్చారు. తానీషావద్దకు తీసుకు రాబడుతూ రామదాసు రాముణ్ణి గురించి పలుకుతూ వచ్చినట్టు శంకరయ్య ఎవరికీ అర్థంకాకుండా "గాంధీ మహాత్ముని" గురించి ఏవో అరుస్తూ వస్తున్నాడు. మధ్య మధ్య "నే చెప్పలా?" అని దబాయించి అడుగుతున్నాడు. "అన్నీ చెప్పావులే!" అంటున్నారు బ్రహ్మచార్లు.

యాజులు బ్రహ్మచార్లను వాళ్ల పని చూసుకోమని పంపించి, "ఏంరా, శంకరయ్యా? ఏం చేసుకొచ్చావు?" అన్నాడు.

"పనయితే చేసుకొచ్చాను. అంతా చెప్పుమంటే నేను మాటలుకొక్క లేను. నువ్వడుగు; నేను చెప్పక పోతే అప్పుడను!"

"ఆ దుర్గాడిది ఏవూరు?"

"అదేదో చెప్పాడయ్యా! పట్నం. అవునవు! పట్నం!"

"పట్నమేమిటి?"

"అవునూ! పట్నంలో అన్నాడు చదువుతున్నాట్ట!"

"అన్న రేమిటి?"

"ఆఁ! నాకు తెలిసేడుమనా, ఏమన్నానా?"

"ఇంతకీ వా డేవూరివాడంటే పట్నమంటా వేమిరా?"

"అదే చెప్పాడు మరి!"

"బాగుంది! ఇక్కడికి కెందుకు వచ్చాట్ట?"

"అదేదో—ఆఁ! మనల్ని అందర్నీ చూడటానికి వచ్చానన్నాడు.

"హరి పిడుగా!"

"నామాట నమ్మకపోతే నువ్వే వెళ్లి అడగవచ్చును!"

"నిన్ననటం లేదు లేవోయ్! వాడు నీవంటి వాళ్లను పదిమందిని కలిపి అవుపోసనం పుచ్చుకునేట్టున్నాడు. అయితే ఇంతకూ ఏమంటాడ్రా వాడూ? అదీ వాడూ వెకవెక లాడుతున్నార్రా?"

"అట్లా అడుగు చెబుతాను! వాళ్లిద్దరూ తప్పకుండా పెళ్లి చేసుకుంటారు. ఆ మాట ఆకుర్రవాడే చెప్పాడు! పైగా దాంట్లో తప్పులేదని కూడా రుజువు చేశాడు!"

"ఛీ భ్రష్టుడా!"

౫

యాజులు అవస్థ వర్ణనాతీతంగా ఉంది. లచ్చయ్యగారింటికి వచ్చిన కుర్రవాడి పేరు మాత్రం ఎట్లాగయితే నేం బయట పడ్డది. ఆపైన ఒక్క నలుసయినా తెలియ లేదు. తీరా సమయానికి గ్రామంలో లచ్చయ్య భార్యాకూడా లేకుండా పోవట మేమిటి?—తన కర్మం కాకపోతే! ఆవిడ ఉంటే ఏ ఇల్లాలి ద్వారా నయినా బయటికి లాగవచ్చును—ఆ కుర్రవాడెవరో, వాడికి లచ్చయ్యగారింట ఏం పనో, వాడూ అదీ (సరోజిని) అస్తమానమూ వెకవెకలూ పకపకలూ ఆడటానికి హేతు వేమిటో ఇత్యాది వివరాలు.

పోనీ లచ్చయ్యనే నిలవేసి అడుగుదామంటే ఆ కుర్రవాడెప్పుడూ లచ్చయ్య వెంట ఉంటూ లచ్చయ్యను పలకరించినప్పుడల్లా తనే అందుకుని చావ గొడ్తాడు. అతడి మాటలు బొత్తిగా అర్థం కావు. తెలుగో అరవ మోకూడా తెలియదు. పైగా అతను మాట్లాడుతున్నంతసేపూ ఇంకోర మాట రానివ్వడు.

శంకరయ్య—పిచ్చి ముండాకొడుకు!—ఎందుకూ కొరగాకుండా ఉన్నాడు.

ఆ కుర్రవాడు వచ్చి అప్పుడే మూడు రోజులయింది. వాణ్ణి గురించి తెలుసుకోవలసింది చూడబోతే బోలెడుంది. తెలుసుకొన్నది బొత్తిగా ఏమీ లేదు.

ఈ మనోవ్యాధి చాలనట్టు శంకరయ్య కిందటి రాత్రి ఇంకో విశేషంకూడా చెప్పి వెళ్లాడు—ఎంత మటుకు నిజమో! ఆ ప్రసాదరావూ ఈ సరోజని బయటి గదిలో పక్క పక్కగా మంచాలు వేసుకుంటూ పడుకుంటారుట. ఇదే నిజమయితే—'నిజమని రుజువు చెయ్యగలిగితే!— లచ్చయ్య భరతం పట్టించవచ్చును. ఔరా! తమ అందరి కళ్లల్లోనూ ఇంత తాల్చిన కారంకొట్టి ఇంట మిండడిని తెచ్చి పెడతాడా లచ్చయ్య! ఊరు గొడ్డుపోయిందను కున్నాడా?

ఆ రాత్రే ఈవిషయ మేమిటో తేల్చాలని పట్టు పట్టాడు యాజులు. ఇంకొకర్ని మద్దతుగా ఉంచుకుంటే సాక్ష్యం ఉంటుందని ఆలోచన తట్టింది, కాని కన్నంలో దొరికే దొంగకు ఏసాక్ష్యం కావాలి కనక? ఒకవేళ ఇంతాచేసి ఏమీ లేకపోతే రెండో వాడితో చిక్కొంటుంది అని యాజులు తను చెయ్యదల్చుకున్న కాస్త అన్వేషణా స్వయంగానే చేద్దా మనుకున్నాడు.

౬

రాత్రి పదిన్నర అయింది. వీధి నిర్మానుష్యంగా ఉంది. అంతవరకూ అక్కడక్కడా అరుగులమీద చేరి ఆత్మస్తుతి కాకపోయినా పరనింద చేస్తున్న గ్రామస్థులు ఒక్కొక్కరే నిష్క్రమించారు.

గుడి మండపం మీద చీకట్లో ప్రసాదరావూ శంకరయ్యా కూచుని చాలా రహస్యంగా మాట్లాడుకుం టున్నారు.

"నేనూ సరోజినీ ఒకచోట పడుకుంటామని ఆ ముసలాడి కెందుకు చెప్పావయ్యా?" అన్నాడు ప్రసాదరావు.

"అయ్యో! నేను చెప్పలా!" అన్నాడు శంకరయ్య.

"అయితే సరే! రేపటినించి చెప్పావేమో అని అన్నాలే! ఎందుకంటే, ఇప్పుడువాడికీ సరోజినిమీద భ్రమ ఉంది కాదూ? అసూయ పడతాడు. తెలియలే?"

"తెలిసింది" అన్నాడు శంకరయ్య నిట్టూర్పు విడిచి. అక్కడికి ఒక గండం గడిచింది. నోరుజారి అన్నాడు శంకరయ్య యాజులతో ఆమాట. చెప్పలేదని ప్రసాదరావు నమ్మాడు కనక ఫరవాలేదు అనుకున్నాడు. శంకరయ్య చెప్పినట్టు ప్రసాదరావు సులభంగానే గ్రహించాడు. అసలు అదే అతనికి కావలసి[illegible].

"ముసలాడికి పిల్లదాని మీద ఎంత భ్రమ ఉందీ నీకు తెలీదు, తాతా. నీకు బహుశా ఇవాళే చూపించగలుగుతానేమోగా! తొందర ఎందుకూ?"

"నేను నమ్మలేకుండా ఉన్నానబ్బా! యాజులు అగ్నిహోత్రం! అటువంటివాడు కాడు!...అయినా చూద్దాంగా!"

"అవును, తినబోతూ రుచులడగటం ఎందుకూ? ఒక్కరోజుకే తొందరపడుకు రెండు మూడు రోజుల్లోనే రహస్యం బట్టబయలు చేస్తాను...ఎందుకూ? అ-దు-గో! మన యాజులు! భేష్! జాగ్రత్తగా గమనిస్తూండు, ఏం చేస్తాడో! మాట్లాడకు."

యాజులు మెల్లిగా లచ్చయ్యగారింటి వైపు వచ్చాడు. వీధిలో ఎవరూ లేరు. ఎటుపోయి ఎటువచ్చినా మంచిదని లచ్చయ్య ఇంటిముందు ఆగి వంగి అరికాల్లో ఏదో అంటినట్టు నటించి దులుపుకున్నాడు. ఎక్కడా ఏమీ అలికిడి లేదు. ఆయన మెల్లిగా లచ్చయ్యగారి అరుగెక్కి కిటికీ తలుపుల సందుగుండా గదిలోకి తొంగి చూడాలి. అదీ కార్యక్రమం. తీరా ఉపక్రమించుదామనుకుంటుండగానే గుండెలు పటపలాడటం మొదలు పెట్టింది. ధైర్యం చెయ్యాలని చూశాడు. లాభంలేక పోయింది. అరుగు ఎక్కవలసిన యాజులు అరుగుదాకా వెళ్లి దాని మీద చతికిల బడ్డాడు. ఇంకా కొంచెం సేపటికి మిగతా కార్యక్రమం జరపటానికి తగిన సత్తా రావచ్చునేమో కాని ఇప్పటి కింతవరకే సత్తా ఉంది.

ఎక్కడో ఏదో చప్పుడయింది. యాజులు గుండె బద్దలయింది. దబ్బున అరుగుమీదినించి దిగి వీధిమధ్యకు వచ్చి రెండడుగులు వేసి ఆగాడు. ఏమిటీ పిరికితనం? తెగించి మళ్లీ వెళ్లి అరుగుమీద కూచున్నాడు. అంతవరకూ అదివరకు ఒకసారి చేసిన పనేగా! పైన ఏమి చేతామా అని అనుమానిస్తుండగా గదిలో గాజుల చప్పుడయింది. ఎవరో ఆడది నిద్రమత్తున కొద్దిగా మూలిగింది.

ఇక సంకోచించి లాభం లేదనుకున్నాడు యాజులు. ఈ ప్రయత్నంలో తన గుండె పగిలిపోవటంవల్ల ప్రాణాలుపోయినా సరే గదిలో ఏమి జరుగుతున్నదో చూసి తీరవలసిందే. లోకం యావత్తూ నిద్రావస్థలో ఉంది. తనకు రాగల అపద ఏమిటి? కుర్రవాడల్లే భయపడితే ఏం లాభం?...తనకు యాభై తొమ్మిదో ఏడు! ఎవరన్నా చూస్తే ఏమనుకుంటారు? ఇప్పుడు తన వయస్సు ఏపదో పన్నెండో ఉంటే బాగుండును!...

* * *

"ఇక రా! మన కిప్పుడా పెద్దమనిషితో కొంచెం పని ఉంది! దిగు! చప్పుడు చెయ్యకు!" అంటూ ప్రసాదరావు చల్లగా మండపం మీదినించి వీధిలోకి జారి శంకరయ్యను కూడా దింపాడు.

యాజులు మనుష్యుల సందడికి వెనకు తిరిగి వీధివైపు చూస్తున్నాడు.

"ఎవరు వారు?"

యాజులు సరిగా అడుగెత్తు ఎగిరాడు. చప్పున అరుగు మీదినించి దిగి రోడ్డుమీద నుంచున్నాడు. తను చేస్తున్న పనికి ఇద్దరు సాక్షులు. ఒకడు ఆగదిలో ఉండవలసిన ప్రసాదరావూ, రెండోవాడు పిచ్చి ముండాకొడుకు, శంకరయ్యా!

"ఓహో! యాజులవారా? ఏదో పనిమీద ఉన్నారల్లే ఉంది. సరోజిని మేలుకునే ఉందేమో, తలుపు తట్టక పోయినారా?" అన్నాడు ప్రసాదరావు.

శంకరయ్య కీ నాజూకులు తెలేవు మోట దబ్బే తప్ప.

"అయితే, నిన్ను అరగంటనించీ గమనిస్తున్నాను. ఎందుకట్లా కాలుకాలిన పిల్లల్లే అరుగు లెక్కడిగా, లోపలికి చూడా, అటూ ఇటూ పరీక్ష చెయ్య—ఏమిటిది? ఏమిటి నీ ఉద్దేశం? నువ్వింత విడిచేసిన వాడివని నేను ఎన్నడూ అనుకోలేదు. ఛీ!"

యాజులుకు మాటాడవలసిన అగత్యం వచ్చింది. కాని ఆయన వేసిన గుటకలవల్ల ఏం చెబుతున్నాడో సరిగా తెలియలేదు వినేవాళ్లకు.

"అక్—నేనుక్—ఏక్!"

ఇక లాభం లేదని యాజులు ప్రయత్నం మాని మౌనం వహించాడు. మాటాడినా మానినా గుటకలు తప్పలేదు.

"మీరుకూడా అట్లా అంటారేం, తాతగారూ? పెద్ద వాడాయన చూస్తే తప్పేం వచ్చిందీ? ఆ గదిలో వుండేది సరోజినియేగా!"

"పెద్ద తనం బుగ్గయినట్టే ఉంది! ఏం చూస్తున్నా వంటే గుడ్లుపెట్టుకు చూస్తూ మాట్లాడడేం?" అన్నాడు శంకరయ్య.

"ఆయన్నడగటం ఎందుకూ? ఇప్పుడే తేలుస్తాను. సరోజినీ!"

"ఎవరది?" అంటూ సరోజిని తలుపు తెరిచింది. ఒక చేత్తో కుచ్చెళ్లు సద్దుకోవటం చూస్తే అప్పుడే బట్ట కట్టుకోటం అయినట్టు కనపడుతున్నది. "నువ్వట్రా, అన్నయ్యా? ఎక్కడికి వెళ్లావు భోంచేసి?"



"ఇక్కడే మండపంమీద కూచున్నాం నేనూ శంకరయ్య తాతా!...నీవు గదిలో ఏం చేస్తున్నావు?"

"బట్ట కట్టుకుంటున్నాను, ఏం?"

"ఏం లేదులే! నీవు లోపలికి పదవే, అమ్మాయి! నాకింకా కొంచెం పనుంది."

ప్రసాదరావు సంతోషంతో పొంగి పోతున్నాడు. అతను పెద్ద నాటకం ఆడాడు. అందుకు అనేకమంది సహాయం చేశారు. ముందు పెత్తల్లి, లచ్చయ్యగారి భార్యా, ఊళ్లో లేకుండా ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తరవాత లచ్చయ్య ప్రసాదరావు ఫలానా అని ఎవరికీ తెలియకుండా నెగ్గించుకొచ్చాడు. తరవాత శంకరయ్య తన బుట్టలో చాలా ఒడుపుగా పడ్డాడు. సరోజిని తన వంతు వచ్చేటప్పటికి తన పోర్షను చక్కగా నటించింది. ఇంతా నాటకం ఈయాజులు ముండ్మోకొడుకు పరాభవానికా? కాలాన్ని వెనక్కు తిప్పాలని చూస్తున్న మూర్ఖులలో ఈయాజులు ఒకడు. ఇతడి చేత సరోజినీ, ఆమె తండ్రీ చాలా బాధపడవలసి ఉన్నారు.

ప్రసాదరావు పళ్ళు బిగబట్టి, "పెద్దవాడివై పోయినావు, ఇంగ్లీషు అయితే నీకు ఉండును. నేస్తు" అని ఉరిమాడు.

"చేసేది శివపూజలూ, దూరేది దొమ్మరి గుడిసెలూ! ఈ మోహానికి గాంధీ మహాత్ములు చాల్లే మరి. ధర్మాన్ని ఉద్ధరించేటందుకు అవతరించాడు —అవతారం!"

ఒక్క క్షణం యాజులుకు లోపలినించి ఉద్రేకం వస్తున్నది. దాన్ని ఎట్లా బయట పెట్టినా తగవ కావటం తప్ప ఏమీ లేదు.

తలవంచుకుని యాజులు ఇంటిదారి పట్టాడు.

ప్రసాదరావు ఆయన వంక చూస్తూ "ఆ పరిస్థితుల్లో నేనైతే అంత గాంభీర్యంగా ఉండ గలనా?" అనుకున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నాడు శంకరయ్య

"ఏమీలేదూ!" అంటూ అతను లోపలికివెళ్లి తలుపు వేసుకున్నాడు.